పల్లె వెలుగు ఏదీ..!

- చాలా గ్రామాలకు కానరాని ఆర్టీసీ సౌకర్యం
- సైకిల్ స్టాండ్లుగా బస్టాండ్లు



మసకపల్లి నుంచి కె.గంగవరం వస్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు

కె.గంగవరం: రవాణా వ్యవస్థ బాగుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది.. అదే లేకుంటే ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంటోంది.. పల్లెలకు 'పల్లె వెలుగు' బస్సులు రాక ఇబ్బంది ఎదురవుతోంది.. ఎప్పుడూ ఒకే రూట్లో బస్సులు ప్రయాణించడమే కానీ, మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకుండా పోయింది. అక్కడి నుంచి ఏదైనా పనిపై రాజమహేంద్రవరం, కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటేనే గ్రామీణ ప్రాంత ప్రజలు నరకయాతన పడుతున్నారు. నియోజకవర్గంలోని కె.గంగవరం మండలం నరజాడ, కూళ్లమల్లవరం, ఊడిమూడి, పాతకోట, కొత్తకోట, సుందరపల్లి, వ్రటపూడి, నెలపర్తిపాడు, తాడిగొయ్య, భట్లపాలిక పరిధిలోని దరువుపేట తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. కాజులూరు మండలంలో చాలా గ్రామాలకు బస్సులు తిరగడం లేదు. గతంలో మంజేరు – కాకినాడ, దుగ్గుదూరు – కాకినాడ, నామవారిపాలెం – కాకినాడ, మతుకుమిల్లి – కాకినాడ, అంద్రండి – కాకినాడ బస్సులు నడిచేవి. అయితే రద్దీ లేదనే కారణంతో ప్రస్తుతం ఆ బస్సు సర్వీసులను రద్దు చేశారు. రామచంద్రపురం మండలం వెల్ల, కాపవరం, యనమదల, భీమక్రోసుపాలెం, ఆదివారపుపేట, బాపనయ్యచెరువు తదితర గ్రామాలకు బస్సులు వెళ్లడం లేదు. దీంతో పాటు శివారు గ్రామాలకు వెళ్లే అరకొర బస్సులు కూడా గ్రామ శివారు నుంచి వెళ్లిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గ్రామీణ ప్రాంత ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి జేబులను గుల్ల చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి మారుమూల గ్రామాలకు కూడా బస్సు సర్వీసులు వేయాలని, దీంతో పాటు రద్దు చేసిన రూట్లో సర్వీసులను పునరుద్ధరించాలని ప్రయాణికులు, గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిరుపయోగంగా బస్టాండ్లు

గ్రామీణ ప్రాంతాల్లోని బస్టాండ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. రాత్రయితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా నిలుస్తున్నాయి. 60 శాతం గ్రామాల్లో బస్సులు ఊరి శివారు నుంచి పట్టణాలకు వెళుతున్నాయి. దీంతో ఊరి శివారున ప్రధాన రహదారికి చేర్చి గతంలో బస్టాండ్‌లను నిర్మించారు. కానీ ఇప్పుడవి సైకిల్ స్టాండ్లుగా దర్శనమిస్తున్నాయి. పగలు జూదాలకు నిలయాలుగా, రాత్రి సమయంలో మందుబాబులకు వేదికలుగా నిలుస్తున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లోని బస్టాండ్లకు భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉంది. అలాగే ప్రజల అవసరాల దృష్ట్యా సర్వే చేసి అన్ని రూట్లలో బస్సులు తిప్పేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమయం వృథా అవుతోంది



పల్లెలకు సరైన బస్సుల సర్వీసులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోజూ వివిధ ప్రాంతాలకు వెళ్లే వారి పరిస్థితి ఒక చెప్పనవసరం లేదు. అరకొర బస్సులు సరైన సమయానికి ఉండడం లేదు. దీనిల్ల ఆటోలు, వ్యాన్‌లు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో డబ్బులు, సమయం వృథా అవుతుంది.

–రాయుడు జగన్

బస్టాండ్లకు భద్రత కల్పించాలి



గ్రామీణ ప్రాంతాల్లోని బస్టాండ్లు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఇవి ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం లేకపోలేదు. కనీస పర్యవేక్షణ కూడా లేకపోవడంతో బస్టాండ్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయాయి. ఆర్టీసీ అధికారులు ఇకనైనా పట్టించుకోవాలి.

–మేడిశెట్టి రాంబాబు, యర్రపోతవరం

క్లుప్తంగా

వర్గీకరణకు వ్యతిరేకంగా వినతిపత్రం



కమిషన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్రసాదరావు

కపిలేశ్వరపురం: ఎస్సీ వర్గీకరణ సరికాదంటూ కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఎస్సీ ఏక సభ్య కమిషన్‌కు తమ అభిప్రాయాన్ని వెల్లబుచ్చినట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శి మాదే ప్రసాదరావు కపిలేశ్వరపురంలో తెలిపారు. మాలల ఐక్యత వర్గీకరణ ఎలా దెబ్బతీస్తుందో మహానాడు కన్వీనర్ చీకురుమెల్లి కిరణకుమార్‌తో కలిసి కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకి వివరించామన్నారు. వర్గీకరణ అంశం రాజ్యాంగానికి విరుద్ధమని చెప్పామని ప్రసాదరావు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాయవరం: సాంకేతిక కారణాలతో స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని రామచంద్రపురం డివిజన్ ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రత్నాలరావు గురువారం విలేకరులకు తెలిపారు. విద్యుత్ లైన్ మార్పు కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. రాయవరం, నదురుబాద, వి.సావరం, వెదురుపాక, మహేంద్రవాడ రోడ్, లొల్ల గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. సోమేశ్వరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చెల్లూరు, మాచవరం, సోమేశ్వరం, పసలపూడి తదితర గ్రామాలకూ విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు.

25 శాతం ప్రీమియం రైతులే చెల్లించాలి

కపిలేశ్వరపురం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రబీ పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై)లో బీమా ప్రీమియంలో 25 శాతం వాటాను రైతులే చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ బీమా పథకాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. కాగా ప్రీమియం మొత్తంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 37.5 శాతం చొప్పున మొత్తం 75 శాతం సొమ్మును చెల్లిస్తాయన్నారు. మిగిలిన 25 శాతం వాటాగా రైతులు ఎకరాకు రూ.630 చెల్లించాలన్నారు. బ్యాంకులో రుణం పొందినవారు రైతులు బ్యాంకు ద్వారా ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకు రుణం తీసుకోనివారు బీమా పథకంలో నమోదు అయ్యేందుకు రైతు సేవా కేంద్రం ద్వారా పంట విత్తిన ధ్రువీకరణ పత్రాన్ని పొందడంతో పాటు, 'ఈ పంట'లో తమ పంట తాలూకు వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం కామన్ సర్వీస్ సెంటర్, పీఏసీఎస్, పోస్టాఫీస్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వద్ద ఎక్కడైనా ఈ పథకంలో నమోదు కావాలన్నారు. ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 31 వరకూ గడువు ఉన్నట్టు ఏఓ తెలిపారు.

గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించే లక్ష్యంతో గురువారం పలు గ్రామాల్లో ప్రత్యేక నవీకరణ కేంద్రాలను నిర్వహించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి పర్యవేక్షణలో కేదారిలంక, నేలటూరు సచివాలయాల్లో చిన్నారుల వివరాలను డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్ర ఆధార్ వివరాలను నవీకరించారు. శుక్రవారం అద్దంకివారిలంక, వెదురుమూడి గ్రామాల సచివాలయాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

ప్రజాప్రతినిధులకు నేడు శిక్షణ తరగతులు


మండపేట: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు, వాటి కార్యాచరణపై ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ వీఎన్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని గురువారం ఆయన చెప్పారు. పంచాయతీ డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్ 2024–25కు సంబంధించి శిక్షణ ఉంటుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీలతో పాటు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

రాయవరం: ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ హెచ్చరించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం ఆయన ఎరువులు, పురుగు మందుల వ్యాపారులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ, అనుమతి ఉన్న ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలన్నారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. రైతుకు అమ్మకం చేసిన ప్రతి ఎరువుల బస్తాను డీబీటీలో తప్పనిసరిగా చూపించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన డీలర్ల స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్‌లు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. సమావేశంలో గ్రామ విస్తరణాధికారి శివశంకర్, మండలంలోని 12 గ్రామాలకు చెందిన ఎరువులు, పురుగు మందుల డీలర్లు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మండపేట: మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను పుణికిపుచ్చుకుని, రాష్ట్రంలో రామరాజ్యాన్ని తలపించేలా పాలన సాగించి, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బాసటగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని పార్టీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శనివారం తమ పార్టీ అధినేత, అభివృద్ధి ప్రదాత, ప్రజాబంధు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును రాష్ట్రమంతటా పండగ వాతావరణంలో జరగనున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా మండపేటలో ఘనంగా వేడుకలు నిర్వహిస్తామని, మూడు మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉదయం పది గంటలకు విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయానికి తరలిరావాలని కోరారు. అదే విధంగా వైఎస్సార్ అభిమానులు కూడా హాజరై ఈ వేడుకల్లో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి



కోరుమిల్లిలో జాబ్ కార్డు అందజేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

కపిలేశ్వరపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పారదర్శకంగా చేపట్టాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులను కోరుమిల్లి గ్రామ ప్రజాప్రతినిధులు కోరారు. స్థానికంగా గురువారం ఉపాధి గ్రామసభను నిర్వహించారు. ఈ నెల 21న కపిలేశ్వరపురంలో మండల స్థాయి సామాజిక తనిఖీ వేదికను నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామ సభలు జరుగుతాయని సామాజిక తనిఖీ డీఆర్పీ బి.శ్యామ్ తెలిపారు. నూతనంగా మంజూరైన జాబ్ కార్డులను సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు ఉపాధి కూలీలకు అందజేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి పనులపై గ్రామస్తులు, రైతులతో చర్చించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ జె.లోవరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సునీల్, సీనియర్ మేట్లు వింటి పల్లంరాజు, సఖిలే సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు కూలీలు పాల్గొన్నారు.

పలువురికి వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



నాగబాబును పరామర్శిస్తున్న పార్టీ నాయకులు

మండపేట: వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు తాతయ్య వృద్ధాప్యంతో గురువారం మరణించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయనతో పాటు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్లు పోతంశెట్టి వరప్రసాద్, పిల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు పెంకే గంగాధర్, అధికారి శ్రీనివాస్, తణుకు అశోక్, పాలమాల సత్తిబాబు, మొండి మురళి తదితరులు ఉన్నారు. అలాగే ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కాళ్లకూరి నాగబాబును ఎమ్మెల్సీ తోటతో పాటు, రాధాకృష్ణ, పలువురు పార్టీ నాయకులు పరామర్శించారు. పాత ఆంధ్రాబ్యాంకు వీధిలో ఉన్న నాగబాబు నివాసానికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పట్టణంలోని ఐటీఐ కాలేజీ వ్యవస్థాపకుడు వల్లూరి గంగరాజు కుమారుడు వల్లూరి రాంబాబు అనారోగ్యంతో మరణించారు. ఆయన నివాసానికి వెళ్లి రాంబాబు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ నాయకులు శిరంగు శ్రీనివాస్, మీగడ శ్రీనివాస్, పెంకే వెంకట్రావు, సాధనాల శివ, పట్టణ ప్రముఖులు కోనే వీర్రాజు, రాకుర్తి సత్యనారాయణ, చెన్నా గాంధీ, గ్రంధి నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



వెంటూరు రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్



కాజులూరులో రైతు సమస్య వింటున్న ఆర్ఐ వేగేశ్వరరావు

రాయవరం: ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఐవీ శెట్టి అన్నారు. మండలంలోని వెంటూరులో గురువారం ఆయన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల భూ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి, ప్రాధాన్య క్రమంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక రైతుల నుంచి 10 అర్జీలను స్వీకరించారు.

రికార్డుల స్వచ్ఛీకరణకు..

కపిలేశ్వరపురం: రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణకు గ్రామాల్లో సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. మండలంలోని వాకతిప్పలో గురువారం గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సర్పంచ్ కొరిపెల్ల వెంకట నాగ స్రవంతి అధ్యక్షత వహించారు. భూ యాజమానుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వాటిని సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ ఆదేశించారు. అనంతరం గ్రామంలో పర్యటించి సదస్సు ప్రాముఖ్యాన్ని వివరించారు. రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరస్పర అంగీకారంతో సమస్యల పరిష్కారం

కాజులూరు: గ్రామాల్లో రైతుల పరస్పర అంగీకారంతో వ్యవహరించినప్పుడే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని ఆర్ఐ వేగేశ్వరరావు అన్నారు. గురువారం కాజులూరులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో తలెత్తిన భూ హెచ్చు తగ్గులను సరి చేసుకునేందుకు ప్రభుత్వం ఈ సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. సరిహద్దు తగాదాలను రైతులు పరస్పరం అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. వివిధ సమస్యలపై 19 అర్జీలు వచ్చాయని ఆర్ఐ తెలిపారు. మండల సర్వేయర్ మూర్తి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైల్వే క్వార్టర్లు

- వృథాగా ప్రజాధనం
- ఏళ్లు గడుస్తున్నా కానరాని వినియోగం



కె.గంగవరంలో నిరుపయోగంగా రైల్వే భవనాలు

కె.గంగవరం: రూ.కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన రైల్వే క్వార్టర్స్ నిరుపయోగంగా మారుతున్నాయి. ముందుచూపు లేక ప్రస్తుతం ఈ భవనాలు ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. రామచంద్రపురం పట్టణం, కె.గంగవరం మండలాల్లో సుమారు రూ. 3 కోట్లతో 2002లో ఈ రైల్వే భవనాలను నిర్మించారు. ప్రస్తుతం ఇవి ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఇదిలా ఉంటే కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద నిర్మించిన రెండు రైల్వే క్వార్టర్లు కనీసం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. భవన నిర్మాణం కూడా అసంపూర్తిగా ఉంది. ప్రస్తుతం భవనాల లోపల తుప్పలు పెరిగి పాములు సంచరిస్తున్నాయి. పట్టణంతో పాటు కె.గంగవరంలోని రైల్వే భవనాల వద్ద రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. 2001లో అప్పట్లో కేంద్ర రైల్వే మంత్రి మమతా బెనర్జీ ఈ రైల్వే లైనుకు నిధులు మంజూరు చేసి నిర్మాణం కూడా పూర్తి చేశారు. అయితే కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్ నిర్మాణం అంతంత మాత్రం జరగడం వల్ల ఇవి పూర్తిగా నిరుపయోగంగా మారిపోయాయి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ రైల్వే లైనుకు కొంత నిధులు మంజూరు చేసినా ఈ రైల్వే వంతెన పూర్తి కావడానికి మరో పదేళ్లు పడుతుందని అంటున్నారు. అప్పటికి ఈ భవనాలు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకునే అవకాశం ఉంది. రామచంద్రపురం పట్టణంలో ఉన్న ఈ భవనాలను అద్దెకు ఇస్తే కనీసం రైల్వే శాఖకు కొంతైనా ఆదాయం చేరుతుందని స్థానికులు అంటున్నారు. ఏదేమైనా 16 ఏళ్లుగా ఈ రైల్వే భవనాలు నిరుపయోగంగా మారడం, ప్రస్తుతం శిథిలావస్థకు చేరే స్థితిలో ఉండడం ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి.

వినియోగంలోకి తీసుకొస్తే మంచిది



రైల్వే భవనాలు నిరుపయోగంగా మారకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇన్నేళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలు శిథిలావస్థకు చేరకముందే వినియోగంలోకి తీసుకువస్తే మంచిది.

–రెడ్డి జయరాజు

రైల్వే లైను పూర్తి చేయాలి



కోటిపల్లి రైల్వే లైన్‌ను వీలైనంత త్వరగా ప్రభుత్వం పూర్తి చేయాలి. ఇప్పటికే రూ.కోట్లు ఖర్చు పెట్టి వేసిన కాకినాడ – కోటిపల్లి రైల్వే లైన్ అంతంత మాత్రంగా వినియోగంలో ఉంది. ఈ లైన్ కోసం ఏర్పాటు చేసిన భవనాలు మాత్రం పాడవుతున్నాయి.

–పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ. కె.గంగవరం

పన్నులు చెల్లించకపోతే ఆస్తి స్వాధీనం

- ఖాళీ స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ యజమానులదే బాధ్యత
- కమిషనర్ రంగారావు స్పష్టం



రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందికి ఆదేశాలిస్తున్న కమిషనర్

మండపేట: పట్టణంలోని ఖాళీ స్థలాల యజమానులు ఏళ్ల తరబడి పన్నులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్న వారి ఆస్తులను జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో గురువారం రెవెన్యూ అధికారులు, సచివాలయ అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, నివాస ప్రాంతాల మధ్య లే అవుట్లు, శివారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఆయా స్థలాలకు ఏళ్ల తరబడి యజమానులు ఆస్తి పన్ను చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి వారందరికీ ఇప్పటికే నోటీసులు కూడా ఇచ్చినట్టు చెప్పారు. నోటీసులు అందుకున్న స్థల యజమానులు పన్నులు చెల్లించకుండా, ఇంకా నిర్లక్ష్యం వహిస్తే వారి ఆస్తిని స్వాధీన పర్చుకుంటామని హెచ్చరించారు. అలాగే ఖాళీ స్థలాలను పట్టించుకోకపోవడంతో తుప్పలు పెరిగి, విష పురుగులకు ఆవాసాలుగా మారాయని, అవి ఇళ్లలోకి చొరబడటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అందువల్ల తుప్పలు తొలగించే బాధ్యతను స్థల యజమానులు తీసుకోవాలని ఆదేశించారు. ఏ ప్రాంతం నుంచైనా ఫిర్యాదులు అందితే, చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది వార్డుల్లో పర్యటించి, ఖాళీ స్థలాలు గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుప్పలతో స్థలాలుంటే జరిమానాలు విధించాలని చెప్పారు. రెవెన్యూ అధికారి జేవీఎస్ శాస్త్రి, ఆర్ఐలు అందే శ్రీనివాస్, ఉప్పల శ్రీనివాసరావు, వార్డు అడ్మిన్, సెక్రటరీలు పాల్గొన్నారు.

కేంద్ర హోం మంత్రిని కేబినెట్ నుంచి తొలగించాలి



ద్రాక్షారామలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా, దళిత సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను తక్షణం కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ద్రాక్షారామలోని యానం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, జై భీమ్ సంక్షేమ సేవా సంఘం నాయకులు గుబ్బల శ్రీను, వెంటపల్లి రామకృష్ణ, కేవీపీఎస్ జిల్లా నాయకుడు నూకల బలరాం తదితరులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ వర్గాల ఆశాజ్యోతి అయిన అంబేడ్కర్‌పై హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో ఎగతాళిగా, అహంకారంతో మాట్లాడటం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. అంబేడ్కర్‌ను అవమానించడం అంటే యావత్ దేశ ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఆయనను కేంద్ర మంత్రి వర్గం నుంచి తొలగించాలని, బీజేపీ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ చింతా రాజారెడ్డి, కేవీపీఎస్ సత్తిబాబు, కె.సింహాద్రి, డి.అబ్రహం, కె.సత్తిబాబు, పి.బాలకృష్ణ, జి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందితేనే అభివృద్ధి



కుయ్యేరులో వెంకటరమణ, నాగభూషణంలను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

కాజులూరు: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అట్టడుగు స్థాయిలోని పేదలకు అందినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. కోలంకలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కార్యదర్శి పిల్లి నాగరాజు తండ్రి పిల్లి వెంకన్న నాలుగు రోజుల కిందట గుండెపోటుతో మృతి చెందగా, సూర్యప్రకాశ్ తదితర నాయకులు నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా కుయ్యేరుకు చెందిన పార్టీ కార్యకర్తలు మేకల వెంకటరమణ, నాగభూషణంల తండ్రి మేకల వాడపల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను సూర్యప్రకాశ్ ఓదార్చారు. అనంతరం గ్రామంలో ఆయన కార్యకర్తలను కలుసుకుని ప్రజా సమస్యలపై చర్చించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. మత్స్యకార భరోసా, రైతు భరోసా, అమ్మ ఒడి తదితర పథకాలు అందక ఆయా వర్గాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, ఎంపీటీసీ చీకట్ల సత్యనారాయణ, పార్టీ మండల ఎస్సీ సెల్ కార్యదర్శి మేకల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు వాయిదా వేయాలి



నరాల కృష్ణకుమార్, జిల్లా అధ్యక్షుడు, పీఆర్‌టీయూ

కె.గంగవరం: వృత్యంతర శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులకు ఇస్తున్న ఎఫ్ఎల్ఎన్ 6వ విడత శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల చివరి వారంలో క్రిస్మస్ పండగ, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు, డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఉన్నాయన్నారు. అందువల్ల క్రైస్తవ ఉపాధ్యాయులకు ఎటువంటి ఆటంకం లేకుండా డిసెంబర్ 23 నుంచి 28 వరకూ తలపెట్టిన శిక్షణ తరగతులు వాయిదా వేయాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉపాధ్యాయులకు క్రిస్మస్, నూతన సంవత్సర కానుకగా 2023 జూలై 1 నుంచి మధ్యంతర భృతి చెల్లించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, డీఎస్సీ 2003 వారికి సాంకేతికంగా అందాల్సిన పాత పెన్షన్ మంజూరు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కరుటూరికి జీవిత సాఫల్య పురస్కారం



కరుటూరి శ్రీనివాస్

మండపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్, లెఫ్టినెంట్ కమాండర్ డాక్టర్ కరుటూరి శ్రీనివాస్‌కు మెటీరియల్ సైన్స్ రంగంలో చేసిన పరిశోధనలు, అధ్యయనాలకు జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఎన్నో కొత్త ఆవిష్కరణలతో, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు పరిచయం చేసినందుకు సైంటిఫిక్ లారెన్స్ సంస్థ ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రినిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, అంకితభావం, క్రమశిక్షణ కలిగిన శ్రీనివాస్ అనేక పరిశోధనలు చేసి జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని, భావి పరిశోధకులకు మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించండి

అయినవిల్లి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు నల్లచెరువు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. డివిజనల్ నాయకుడు గుండ్రు సత్యనారాయణ మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. అనంతరం అయినవిల్లి మండల పంచాయతీ కాంట్రాక్టు కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకర కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గుమ్ములూరి అనిల్‌కుమార్, సెక్రటరీగా తాడి శ్రావణ్‌కుమార్, కార్యదర్శిగా శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోల నాగబాబు, దాకి జార్జి, గుర్రం రాంబాబు, కాగిత రామకృష్ణ, రామచంద్రరావు తదితరులు ఉన్నారు.